మినరల్ కాదు.. జనరలే!

- నిబంధనలు గాలికొదిలిన వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు
- కొద్దిపాటి కెమికల్ కలిపి మినరల్‌గా కవరింగ్
- సొంత తెలివితోనే ప్లాంట్లు నిర్వహణ
- ప్రజారోగ్యంతో చెలగాటం





మణుగూరులో మినరల్ వాటర్ సప్లై చేస్తున్న ప్లాంట్ల వాహనాలు

మణుగూరుటౌన్: పేరుకే మినరల్ వాటర్ ప్లాంట్లు.. కానీ అంతా కెమికల్స్ తోనే నడిపిస్తున్నారు. ఇలాంటి ప్లాంట్లు రోజురోజుకూ పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. నిబంధనలు పాటించకుండా ప్లాంట్ల నిర్వాహకులు యథేచ్ఛగా స్వచ్ఛమైన నీటి పేరుతో అరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు. ప్రజల అమాయకత్వాన్ని అవసరాన్ని గుర్తించి అక్రమాలకు పాల్పడుతూ.. సొమ్ము చేసుకుంటున్నారు. చెట్టు పేరు చెప్పి కాయలు అమ్మిన చందంగా బోరు నీటిలో కొద్దిపాటి కెమికల్స్ కలిపి మినరల్ వాటర్ పేరిట విక్రయాలు చేస్తూ ప్రజల నుంచి డబ్బులు దండుకుంటున్నారు.

మండల పట్టణ పరిధిలోని అనుమతులు లేని మినరల్ వాటర్ ప్లాంట్ల అనుమతులు లేకుండా ఇంట్లోనే ఆర్వో వాటర్ ప్లాంట్లు వెలుస్తున్నాయి. వీటిని తాగుతూ ప్రజలు అనారోగ్య బారిన పడుతున్నారు. ఆర్థిక ఆరోగ్య పరంగా అనేక అవస్థలు పడుతూ లేని రోగాలను కొని తెచ్చుకుంటున్నారు.

అరకొర అవగాహనతో ప్లాంట్లు..

మణుగూరు మండల, పట్టణంలో ఐఎస్ఐ గుర్తింపు ఉన్న ప్లాంట్లు ఒక్కటి కూడా లేదు. దాదాపు 10కి పైగా మినరల్ వాటర్ ప్లాంట్లు కేవలం ప్యూరిఫై చేస్తూ స్వఅనుభవంతో కెమికల్స్ కలిపుతున్నారు. వాటినే మినరల్ వాటర్‌గా సప్లై చేస్తున్నారు. ఇక్కడ ఉన్నవి దాదాపుగా అన్నీ ఈ రకమైన ప్లాంట్లే అని తెలుస్తోంది.

నిబంధనలు ఇవీ..

మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి ఐఎస్ఐ నిబంధనల ప్రకారం 250 గజాల స్థలం ఉండాలి. ప్లాంట్‌లో తప్పనిసరిగా బయోలాజికల్ ల్యాబులు ఏర్పాటు చేయాలి. నీటి స్వచ్ఛతను ప్రతి రోజూ పరీక్షలు నిర్వహించాలి. చుట్టు పక్కల ప్రాంతాల్లోని డ్రెయినేజీనీరు ప్లాంట్ వైపు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఐఎస్ఐ నిబంధనలు, ట్రేడ్ మార్క్ ఎక్విప్‌మెంట్‌తో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలంటే అనుమతులకు రూ.6లక్షలకు పైమాటే. ప్రతీ ఏడాది రెన్యూవల్ ఫీజు నిమిత్తం రూ.1.25లక్షలు, ల్యాబ్ పరీక్షకు రూ.60వేలు ఉంటుంది. ఇంత ఖర్చును తప్పించుకునేందుకు కేవలం రూ.లక్షన్నర వ్యయంతో సాధారణ పరికరాలతో వాటర్ ప్లాంట్లు నెలకొల్పుతున్నారు. దీనికి తోడు మినరల్ వాటర్ ప్లాంట్ నిబంధనల ప్రకారం పనిచేస్తే ప్రతి ఐదు వేల లీటర్ల నీటిని శుద్ధి చేసేందుకు 35వేల వృథా నీరు బయటికి వస్తుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ వృథా నీరు తిరిగి భూమిలోకి ఇంకేందుకు తగిన ఏర్పాట్లు చేయాలి. కానీ అసలు బోరు నీటిని కొద్దిపాటి కెమికల్స్ కలిపి దర్జాగా విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో వాటర్ క్యాన్ 30నుంచి 50 సార్ల కంటే ఎక్కువ వాడకూడదు. ప్రతి వాటర్ ప్లాంట్ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) అనుమతితో పాటు క్యాన్‌పై తయారు చేసిన తేదీ, బ్యాచ్ నంబర్, చివరి తేదీ ధర ఖచ్చితంగా ఉండాలి.

ఆరోగ్యానికి హానికరం..

ప్రభుత్వం విధించిన నిబంధనలు పాటించని వాటర్ ప్లాంట్లతో ప్రజలకు ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆ నీటిని తాగితే మోకాళ్ల నొప్పులు, ఎముకల అరుగుదల, అలర్జీ తదితర వ్యాధులు సంభవిస్తాయని చెబుతున్నారు. ఇంత జరుగుతున్నప్పటికీ అధికారుల పర్యవేక్షణ కరువైంది. వారు పట్టీపట్టనంట్టు ఉండటం వల్లే వాటర్‌ప్లాంట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం..



ఏజెన్సీ ఏరియాలో మినరల్ వాటర్ ప్లాంట్ నిర్వహించాలంటే అన్ని శాఖల అనుమతి తప్పనిసరిగా పొందాలి. సాంకేతిక నిపుణుల సమక్షంలో నీటి నాణ్యతను పరిశీలించి క్యాన్ల ద్వారా పంపిణీ చేయాలి. అవగాహన లోపంతో కెమికల్స్ కలిపి ఇష్టానుసారంగా తాగునీటిని సరఫరా చేస్తే నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటాం. ఇలాంటి చర్యల వల్ల నీటి కొరత ఏర్పడే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

– రాఘవరెడ్డి, తహసీల్దార్

బస్సులు లేక భక్తుల పరేషాన్

- టీఎస్ఆర్టీసీ బస్సులకు సమయపాలన కరువు
- పూర్తిగా నిలిచిపోయిన స్పెషల్ సర్వీసులు
- గంటల తరబడి బస్టాండ్‌లో ప్రయాణికుల పడిగాపులు



బస్సుల కోసం భద్రాద్రి బస్టాండ్‌లో వేచి చూస్తున్న ప్రయాణికులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి కల్యాణం, పట్టాభిషేకం ఉత్సవాలను తిలకించి తిరుగుపయనమైన రామయ్య భక్తులకు ఆర్టీసీ బస్సులు చుక్కలు చూపించాయి. గురువారం మధ్యాహ్నం నుంచి బస్సులు భద్రాచలం, కొత్తగూడెం బస్టాండ్‌లలో ఆర్టీసీ అధికారులు సూచించిన సమయానికి రాకపోవడంతో గంటల తరబడి బస్టాండ్‌లో ప్రయాణికులు వేచి చూడాల్సిన పరిస్థితి. ఒక్క పక్క ప్రయాణికులతో కిక్కిరిసి బస్టాండ్ మరో పక్క అధిక ఉష్ణోగ్రతలతో ఉక్కపోతతో చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో ప్రైవేట్ వాహనాలలో వారి స్వస్థలాలకు వెళ్లే ప్రయత్నాలు చేశారు. చల్లపూట గమ్యానికి చేరుకోవాలని బస్టాండ్‌కు వచ్చిన భక్తులు గంట తరబడి బస్టాండ్‌లో వేచివుండి ఆర్టీసీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీరామనవమి రోజు పూర్తి స్థాయిలో భక్తులకు సేవలు అందించిన ఆర్టీసీ అధికారులు.. రెండో రోజు బస్టాండ్ ఆవరణలో కూడా కనిపించలేదు. భద్రాద్రిలో రామయ్య కల్యాణం అనంతరం సగం మంది భక్తులు తిరుగుపయణం కాగా మరి కొందరు పట్టాభిషేక ఘట్టం కన్నులారా తిలకించి తిరుగుపయణమవుతారు. ఈ క్రమంలో రామయ్య పట్టాభిషేకం కార్యక్రమం రోజు కూడా భక్తుల భద్రాద్రిలో భక్తుల తాకిడి ఉంటుంది. దీంతో భక్తుల తాకిడికి అనుగుణంగా బస్సులను తిప్పకపోవడంపై రామ భక్తుల నుంచి తీవ్ర ఆక్షేపనలు వినిపిస్తున్నాయి. బస్టాండ్‌లో తెలంగాణలోని హైదరాబాద్, ఖమ్మం, వరంగల్ తదితర పట్టణాలకు వెళ్లే బస్సులు గంటల తరబడి చూసిన రాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ఇదిలా ఉంటే ఏపీకి చెందిన ఆర్టీసీ బస్సులు మాత్ర సమయపాలన ప్రకారం నడిచాయి. దీంతో ఖమ్మం వెళ్లే వారు కొత్తగూడెం వరకు వెళ్లే అక్కడి నుంచి వేరే బస్సులో ఖమ్మం, హైదరాబాద్ వెళ్లొచ్చని అక్కడికి ఏపీ బస్సులు ఎక్కి వెళ్లారు. తీరా అక్కడ బస్సులు లేక ప్లాట్‌పామ్స్ దర్శనం ఇస్తుండడంతో అవాక్కయారు.

డ్రైవర్లు ఆలస్యంగా హాజరయ్యారు..

రెండు రోజుల పాటు శ్రీరామనవమి సందర్భంగా విధులు నిర్వహించిన డ్రైవర్లు సాయంత్రం విధులకు రావడం కొంత అలస్యం కారణంగా బస్సులు సమయానికి నడవకలేదు. తరువాత యథావిధిగా బస్సులు అన్ని రూట్లలో నడిచాయి. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో విజయవాడ రూట్‌లో నడిచే మూడు సర్వీసులను రద్దు చేశాం. శ్రీరామనవమికి ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులు లేవు అంతే. గతంలో తిరిగే బస్సులు నడుస్తున్నాయి.

– రామారావు, డీఎం, భద్రాచలం

క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



దాతలకు రశీదు అందజేస్తున్న సిబ్బంది

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి గురువారం ఓ భక్తుడు విరాళం అందజేశారు. ఏపీలోని కృష్ణ జిల్లాకు చెందిన పి.కృష్ణారావు దంపతులు రూ.1,01,116ల చెక్కును ఆలయ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదంతోపాటు జ్ఞాపికను అందజేశారు. ఆలయ సిబ్బంది నీరంజన్ తదిరుతుల పాల్గొన్నారు.

వెండి పాత్ర బహూకరణ

మణుగూరురూరల్: మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయతీ సాయినగర్ ప్రాంతంలోని షిరిడీ సాయిబాబా ఆలయ ప్రాంగణంలో ఉన్న విజయ విఘ్నేశ్వరస్వామికి స్థానిక శ్రీవెంకటేశ్వర జ్యువెల్లరీ యజమాని సంకా శ్రీనివాసరావు-కోటేశ్వరి దంపతులు 111 గ్రాముల వెండి చెంబును గురువారం ఆలయ కమిటీ సభ్యులకు బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పవన్‌కుమార్ వర్మ, ఆలయ కమిటీ సభ్యులు దోసపాటి నాగేశ్వరరావు, బాలకేశవరావు, సాయి సేవకులు తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీతోనే సమస్యల పరిష్కారం

మణుగూరుటౌన్: కార్మికుల పక్షాన అండగా నిలిచే ఏఐటీయూసీతోనే సమస్యల పరిష్కారం సాధ్యమని ఆ యూనియన్ మణుగూరు బ్రాంచి కార్యదర్శి వై.రాంగోపాల్ అన్నారు. గురువారం యూనియన్ కార్యాలయంలో ఏరియాకు చెందిన ఐఎన్‌టీయూసీ నుంచి కుమారస్వామి, పుల్ల ఆశీర్వాదం, సూర జనార్దన్‌తోపాటు పలువురు కార్మికులు ఏఐటీయూసీలో చేరగా, వారికి యూనియన్ కండువా వేసి రాంగోపాల్, ఉపాధ్యక్షుడు రామనర్సయ్యలు ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా పనిచేసే ఏఐటీయూసీలోకి కార్మికులు రావడానికి ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఈశ్వర్‌రావు, పుల్లారావు, సురేందర్, సుభాని, కొడిరెక్కల శ్రీనివాస్, రత్నం, శివకుమార్, ఆంతోని రవికుమార్, శరత్, జానకి ప్రసాద్, రవి శంకర్, రమేశ్ తదితరులు ఉన్నారు.

పటిష్టంగా అమలు చేయాలి

దమ్మపేట: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్లపూడి రాము కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఉపాధి హామీ కూలీలతో కార్మిక సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అమర్లపూడి రాము మాట్లాడుతూ.. ఉపాధి హామీ కూలీలకు సగటున రోజుకు వేతనంగా రూ.600లు ఇచ్చి, పని ప్రదేశంలో కూలీలకు టెంట్, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేయాలని అన్నారు. పనిచేస్తూ గాయపడిన వారికి ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కుర్సం ముత్యాలరావు, పండూరి వీరబాబు, కునుసోతు నాగమణి పాల్గొన్నారు.

పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలి

కరకగూడెం: రోజు రోజుకూ విస్తరిస్తూ అభివృద్ధి చెందుతున్న కరకగూడెం మండల కేంద్రంలో పబ్లిక్ టాయిలెట్స్ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం మండల కార్యదర్శి కొమరం కాంతరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన గురువారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. దూర ప్రాంతాల నుంచి వివిధ పనుల నిమిత్తం వస్తున్న ప్రజానీకానికి అవసరం వస్తే చాటు లేదని, తక్షణమే పాలకులు, అధికారులు చొరవ చూపి పబ్లిక్ టాయిలెట్లు నిర్మించాలని కోరారు. పార్టీ నాయకులు చర్ప సత్యం, నాగేష్, నరేష్ పాల్గొన్నారు.

సీపీఐ నాయకుల సంతాపం

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్యనగర్ ప్రాంతానికి చెందిన చిప్పల రామస్వామి బుధవారం రాత్రి అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.లక్ష్మీనారాయణలు గురువారం వారి గృహానికి వెళ్లి రామస్వామి మృతదేహాన్ని సందర్శించి నివాళ్లర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సంతాపం తెలిపిన వారిలో పార్టీ పట్టణ కార్యదర్శి డి.సుధాకర్, ఏఐటీయూసీ మండల కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ ఎడారి రమేష్ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి అంకమ్మతల్లి తిరునాళ్లు



అంకమ్మ తల్లి తిరునాళ్ల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న గవర్నర్ రాధాకృష్ణన్

అన్నపురెడ్డిపల్లి/బూర్గంపాడు: మండల కేంద్రంలోని శ్రీఅంకమ్మ తల్లి ఆలయంలో శుక్రవారం నుంచి అమ్మవారి తిరునాళ్లు నిర్వహించనున్నారు. ఈ నెల 23వ తేదీ వరకు తిరునాళ్లు జరగనుండగా.. చివరిరోజు గోపయ్య, తిరుపతమ్మ అమ్మవార్ల కల్యాణ మహోత్సం నిర్వహిస్తారు. కాగా, తిరునాళ్ల మహోత్సవం పోస్టర్లను రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ గురువారం ఆవిష్కరించారు. అన్నపురెడ్డిపల్లి శివాలయ పునఃనిర్మాణకర్త మారగాని శ్రీనివాసరావు ఆధ్వర్యాన సారపాకలోని ఐటీసీ అతిథి గృహంలో గవర్నర్ పోస్టర్లు ఆవిష్కరించగా.. ఆయనకు ఆలయ ప్రత్యేకతలను వివరించారు. కార్యక్రమంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ హన్మంతరావు, గవర్నర్ సంయుక్త కార్యదర్శి భవానీశంకర్, ఆధ్యాత్మికవక్త దైవజ్ఞశర్మ, భద్రాద్రి రామాలయం ఈఓ రమాదేవి పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయ ప్రతిష్ఠ..

మండలంలోని పెంట్లం గ్రామంలో ముత్యాలమ్మ, పోతురాజు ఆలయ ప్రతిష్ఠ మహోత్సవ వేడుకలను శుక్రవారం వైభవంగా జరిపించారు. ఈసందర్భంగా అర్చకులు హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వమించగా పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జన జాతర సభకు తరలిరండి

అశ్వాపురం: మహబూబాబాద్‌లో శుక్రవారం జరిగే కాంగ్రెస్ జన జాతర సభకు మండలంలోని పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, సీనియర్ నాయకుడు గాదె కేశవరెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్ నామినేషన్ సందర్భంగా శుక్రవారం సాయంత్రం 4 గంటలకు జరిగే జన జాతర బహిరంగ సభకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతున్నారని, మండలంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: మహబూబాబాద్ జన జాతర ఎన్టీఆర్ స్టేడియంలో జరిగే భారీ బహిరంగకు మండలం నుంచి భారీగా నాయకులు, కార్యకర్తలు పాల్గొని వియవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరమాచినేని వినీల్ గురువారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ నామినేషన్ సందర్భంగా నిర్వహించే భారీ బహిరంగ సభకు ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా రానున్న సందర్భంగా పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని కోరారు.

విద్యుత్ సౌకర్యం కల్పించాలి



కూనంనేనికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ములకలపల్లి: మండల పరిధిలోని ధర్మన్ననగర్ గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరుతూ కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు వినతిపత్రం అందజేశారు. సీపీఐ మండల కార్యదర్శి ఎండి.యూసఫ్ ఆధ్వర్యంలో గురువారం కొత్తగూడెంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలసి సమస్యను విన్నవించారు. విద్యుత్ సౌకర్యం నిమిత్తం స్తంభాలు ఏర్పాటు చేసినా.. అటవీశాఖ అధికారులు అభ్యంతరం తెలుపడంతో, కరెంటు కనెక్షన్ ఇవ్వలేదని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే కూనంనేని, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

ఉపాధి కూలీల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధి కూలీలు

ములకలపల్లి: ఉపాధి హామీ పని ప్రదేశాల్లో మంచినీటి సదుపాయం కల్పించడంలేదని, మండుతున్న ఎండలకు కనీసం టెంటు సౌకర్యం కూడా ఏర్పాటు చేయట్లేదని ఉపాధి కూలీలు నిరసన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకంలో ములకలపల్లి శివారులోని కిష్టమ్మ చెరువు అభివృద్ధి చేస్తున్నారు. రాజుపేట, గొల్లగూడెం హ్యాబిటేషన్లకు చెందిన సుమారు 50 మంది కూలీలు గత 10 రోజులుగా పనులు చేస్తున్నారు. ఉపాధి సిబ్బంది తీరును నిరసిస్తూ గురువారం కూలీలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పని ప్రదేశాల్లో తాగునీరు ఏర్పాటు చేయాలని, నీడ కోసం టెంటు వేయాలని అధికారులు చెప్తున్నా ఆచరణకు నోచుకోవడంలేదని వాపోయారు. వేసవి తాపానికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచడంలేదని, మెడికల్ కిట్ల మాటేలేదని, అనారోగ్యానికి గురైతే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. పనికి తగ్గ వేతనం అందడం లేదని, కొలతలతో పనిలేకుండా రోజూ రూ.300 తగ్గకుండా కూలీలకు చెల్లిస్తామని చెపుతున్నా, కనీసం 180 రూపాయలు కూడా రావడంలేదని అన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో ఉపాధి కూలీలు ఎర్రపోతుల కుమారి, దుర్గ, జ్యోత్న, పావని, గుమ్మడి దేవస్వామి, ఉషా, రేణుక తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

చంద్రుగొండ: మండలంలోని బెండాలపాడు గ్రామశివారుల అటవీప్రాంతంలోని ఎర్రబోడులో తాగునీటి తొత్తికోయలు తిప్పలు పడుతున్నారు. ఈ క్రమంలో గురువారం గొత్తికోయలు ఎంపీడీఓ కార్యాలయ ఇన్‌చార్జ్‌కు తాగునీటి సదుపాయం కల్పించాలని వినతిపత్రం అందించారు. వేసవి ఎండలు అధికంగా ఉండటంతో చెరువులో నీళ్లు ఇంకిపోయాలని, దీంతో ముత్యాలమ్మ చెరువుతోపాటు అనుసంధానంగా ఉన్న వాగులో చెలమల్లో నీళ్ల తాగుతున్నామని గొత్తికోయ మహిళలు వివరించారు. అధికారులు సత్వరమే స్పందించి తాగునీటి సదుపాయం కల్పించాలని కోరారు.

కంటి వైద్య శిబిరాలు

మణుగూరురూరల్: మండలంలోని ప్రభుత్వ హాస్టళ్లల్లో నిర్వహిస్తున్న ప్రభుత్వ కంటి వైద్య శిబిరాలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా డాక్టర్ గోపిలాల్, నేత్ర వైద్యాధికారి జి.సంజీవరావులు మాట్లాడుతూ.. ఇప్పటివరకు 1,470 మంది విద్యార్థులకు కంటి వైద్యపరీక్షలు నిర్వహించామన్నారు. వీరిలో 35మందికి కళ్లజోళ్లు అవసరమని నిర్ధారించడంతో పాటు మరో ఐదుగురికి మెరుగైన వైద్యానికి రిఫర్ చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమాల్లో ఆర్‌బీఎస్‌కే సిబ్బంది, హాస్టల్స్ వార్డెన్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

చంద్రుగొండ: మండలంలోని పోకలగూడెం గ్రామంలో బాణోత్ హనుమ అనే రైతుకు చెందిన ఆవు విద్యుదాఘానికి గురువారం మృతి చెందింది. బాధితరైతు కథనం ప్రకారం.. ఉదయం వేళ మేతకు వెళ్లిన ఆవు గ్రామ శివారులోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృత్యువాత పడింది. ట్రాన్స్‌ఫార్మర్ కిందికి ఉండటంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు రైతులు చెప్తున్నారు. బాధితరైతుకు విద్యుత్‌శాఖ పరిహారం చెల్లించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

ఎమ్మెల్యేకు వినతి

అశ్వాపురం: మండలంలోని పలు సమస్యలపై కాంగ్రెస్ పార్టీ నాయకులు మణుగూరులో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును కలిసి విన్నవించి వినతిపత్రం అందజేశారు. సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే పార్లమెంట్ ఎన్నికల అనంతరం సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు ఓరుగంటి రమేష్‌బాబు, యక్కటి సత్యనారాయణరెడ్డి, లంకమళ్ల కొండలరావు, తెల్లం వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయాల్లో పూజలు

అశ్వారావుపేటరూరల్: సాయిబాబా ఆలయాల్లో భక్తులు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని వినాయకపురం, అశ్వారావుపేటలోని సాయిబాబా ఆలయాల్లో భక్తులు బాబాను దర్శించుకుని వివిధ రకాల పూజలు చేశారు. అలాగే బాబాకు అభిషేకాలు చేసి, నైవేథ్యాలు సమర్పించారు. సంధ్యాహారతి పట్టి, పల్లకి సేవలు అందించారు. ఆలయం వద్ద మధ్యాహ్న సమయంలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించగా, భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

అగ్నిప్రమాద బాధితులకు వితరణ

దుమ్ముగూడెం: మండలంలోని బైరాగులపాడు గ్రామంలో విద్యుత్ షార్ట్ షర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమై సర్వస్వం కోల్పోయిన బాధిత జుంజురి నరసింహా కుటుంబానికి రాబిన్ పుడ్ హార్మి సంస్థ ఆధ్వర్యంలో దాత రవి నిత్యావసరాలను వితరణగా అందజేశారు. బాధిత కుటుంబానికి 25 కేజీల బియ్యం,నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో మడకం భారతి, శ్రీవిద్యలు పాల్గొన్నారు.

మెరుపుకాలనీ బాధితులకు..

అశ్వారావుపేటరూరల్: అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి కొత్తగూడెం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు అనుచర నాయకులు నగదును వితరణగా అందించారు. గురువారం జలగం వెంకట్రావు జన్మదినం సందర్భంగా స్థానిక పాత ఆంధ్రాబ్యాంక్ వీధిలో కేక్ కట్ చేశారు. అలాగే అభిమానులు, కార్యకర్తలకు కేక్, స్వీట్లు పంచారు. అనంతరం స్థానిక మెరుపుకాలనీలో ఇటీవలె జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన పోలయ్య కుటుంబానికి యూత్ నాయకుడు చిక్కం గోపాలకృష్ణ ఆధ్వర్యంలో రూ.7వేల నగదును ఆర్థిక సాయంగా అందజేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

తాగునీటికి మోటారు ఏర్పాటు



మోటారు ఏర్పాటు పనులు..

ములకలపల్లి: ఎట్టకేలకు మండలంలోని సాయిరాంపురం వాసుల తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గురువారం కాలిపోయిన స్థానంలో మరో మోటారు ఏర్పాటు చేసి, తాగునీటి కొరతను నివారించారు. సాయిరాంపురం గ్రామానికి తాగునీరందించే డైరెక్ట్ పంపింగ్ స్కీం (డీపీ) మోటారు మరమ్మతులకు గురికావడంతో, గత వారం రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. గత్యంతరంలేని పరిస్థితుల్లో గ్రామస్తులు సమీపంలో వ్యవసాయ మోటార్ల నుండి నీటిని తెచ్చుకుంటూ అవసరాలు తీర్చుకుంటున్నారు. ఈ ఉదంతంపై 'సాక్షి'తోపాటు పలు పత్రికల్లో కథనాలు రావడంతో అధికారులు స్పందించారు. యద్ధప్రాతిపదికన పనులు చేపట్టారు. గురువారం నూతనంగా మరో మోటారు ఏర్పాటు చేసి, నీటి సరఫరా పునరుద్ధరించారు. దీంతో స్థానికులు హర్షం వక్తం చేస్తున్నారు.

గ్రంథాలయ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న చేయూత ట్రస్ట్ ప్రతినిధులు

బూర్గంపాడు: మోరంపల్లిబంజర గ్రామంలో చేయూత ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రంథాలయ నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు కొండ్రు వెంకటేశ్వర్లు, చైర్మన్ కైపు లక్ష్మీనారాయణరెడ్డిలు మాట్లాడుతూ.. పేద విద్యార్థులు, నిరుద్యోగ యువతకు అన్నిరకాల స్టడీ మెటీరియల్స్‌ను అందుబాటులో ఉంచేందుకు గ్రంథాలయ నిర్మాణం చేపట్టామన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ట్రస్ట్ ప్రతినిధులు భూక్యా దివ్యశ్రీ, కైపు సుబ్బరామిరెడ్డి, మేడం లక్ష్మీనారాయణరెడ్డి, అలవాల సీతారామిరెడ్డి, మేడం పుల్లారెడ్డి, ఝున్నం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

అశ్వారావుపేటరూరల్: ద్విచక్రవాహనాలు ఢీ కొన్న ఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. బుధవారం రాత్రి అశ్వారావుపేటకు చెందిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు వేముల ప్రతాప్ తన ద్విచక్రవాహనంపై గుర్రాల చెరువు గ్రామానికి వెళ్తుండగా.. ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహనదారుడు అదుపుతప్పి ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో ప్రతాప్ కాలుకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

ముమ్మరంగా రబీ వరి కోతలు



చర్ల మండలం పెద్దిపల్లిలో వరి నూర్పిడి చేస్తున్న యంత్రం

చర్ల: మండలంలో రబీ వరి కోతలు ముమ్మరంగా ప్రారంభమయ్యాయి. మండలంలో విద్యుత్ మోటార్లు, ఆయిల్ ఇంజన్లు, చెరువులు, కుంటల కింద వరి పంటలను సాగు చేసిన రైతులు వరి కోత పనులు చేపట్టి ముమ్మరంగా పనులు కొనసాగిస్తున్నారు. చర్ల మండలంలో రబీలో సుమారు 3 వేల ఎకరాల్లో రైతులు వరి పంటలు సాగు చేయగా డిశంబర్, జనవరి నెలల్లో వరినాట్లు పూర్తి చేసిన రైతులకు సంబంధించి పంటలు కోతకు వచ్చాయి. దీంతో రైతులు వరి కోత పనులు చేపట్టారు. ఈ క్రమంలో మండలానికి బారీగా వచ్చిన వరి కోత యంత్రాలు కోతపనుల్లో నిమగ్నమవ్వగా, వరి చేలల్లో వరికోత యంత్రాల సందడి నెలకొంది. మండలంలోని మామిడిగూడెం, కుదునూరు, ఆర్ కొత్తగూడెం, పెద్దిపల్లి, జెట్టిగూడెం, లింగాల, గొమ్ము గూడెం, జీపీ పల్లి, వీరాపురం, సీ కత్తిగూడెం, కొయ్యూరు, సుబ్బంపేట తదితర గ్రామాల్లో రైతులు వరి కోత పనులు ముమ్మరంగా సాగిస్తున్నారు.